ముంపు నుంచి రక్షణ లేదా?

- వర్షాలు పడుతున్న నేపథ్యంలో కలాసీ కాలనీవాసుల ఆందోళన
- ఎగువ ప్రాంతాల నుంచి పొంగిపొర్లుతున్న వర్షం నీరు
- నీరు వెళ్లే దారి లేక ఇక్కట్లు
- కల్వర్టు నిర్మించాలని కోరుతున్న స్థానికులు



ముంపు సమయంలో ఇళ్లలోకి వర్షం నీరొచ్చి ఇబ్బంది పడుతున్న కలాసీ కాలనీవాసులు (ఫైల్)



ప్రతిసారీ ముంపునకు గురయ్యే కలాసీ కాలనీ

గోపాలపట్నం: వర్షం పడితే ఈ కాలనీ వాసులకు గుండెల్లో గుబులు పుడుతుంది. ఎక్కడ లేని నీరంతా ఇక్కడికే చేరుతుంది. ఇళ్లన్నీ జలమయం అవుతాయి. ఇక్కడి నుంచి ఈ నీరు వెళ్లే దారి లేక కాలనీ వాసులు నానా అవస్థలు పడుతుంటారు. ఇది ప్రతి ఏటా పడుతున్న ఇబ్బందే. కొన్ని పాకలు కూలిపోయి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంటాయని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ 92వ వార్డు లెప్రసీ కాలనీ సమీపంలోని కలాసీ కాలనీ వాసుల కష్టాలు



కాల్వ నిర్మించాల్సిన ప్రాంతం

ఇవి. ఈ కాలనీలో నివాసముంటున్న సుమారు 30 కుటుంబాలు మాకు రక్షణ కల్పించండి అంటూ కోరుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించాలని, ముంపు నీరు వెళ్లేందుకు కాల్వ నిర్మించాలని వేడుకుంటున్నారు. కలాసీ కాలనీ లోతట్టు ప్రాంతం కావడంతో ఎగువ ప్రాంతాలైన బంటాకాలనీ, లెప్రసీ కాలనీ, కొండవాలు నుంచి వర్షం నీరు ఇక్కడికి చేరుతుంది. దీంతో నడుము లోతు మేర నీరు నిల్వ ఉండిపోతుంది. ఇక్కడి నుంచి దిగువ ప్రాంతాలకు వెళ్లే దారి లేక నాలుగైదు రోజులు ఆ నీరు అలాగే ఉండిపోతుందని వాపోతున్నారు. గతంలో ఇక్కడి నీరు మోటార్లతో తోడించారు. ప్రతి ఏటా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు.

మళ్లీ ముంపు ముప్పు తప్పదా?

ఈ వర్షా కాలంలో ముంపు తప్పదా అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పెరిగితే మాకు ముంపు కష్టాలు మొదలవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముంపు రాకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టే చర్యలు కనిపించకపోవడంతో వీరు ఆందోళనకు గురవుతున్నారు.



పద్మనాభనగర్‌లో కాల్వ కోసం వదిలిన ఖాళీ స్థలం

కాల్వ నిర్మించాలి..

ఇక్కడి నుంచి పద్మనాభనగర్ మీదుగా కంపరపాలెం గెడ్డకు కలిపే విధంగా కాల్వ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో రూ. 58 లక్షలతో కాల్వ నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు. అయితే ఆ పనులు జరగలేదు. కాల్వ నిర్మించి ముంపు కష్టాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కల్వర్టు నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుంది



కల్వర్టు నిర్మించాలని ఎన్నాళ్ల నుంచి కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. నాయకులు, అధికారులు వచ్చి చూసేవారే తప్ప మా కష్టాలు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మా సమస్య పరిష్కరించాలని కోరుతుకుంటున్నాము. – వెన్నెల అప్పలనాయుడు, కలాసీ కాలనీ

ప్రతి ఏటా ఇబ్బంది పడుతున్నాం



పూరి పాకల్లో నివసిస్తున్నాం. వర్షాలు పడిన ప్రతి ఏటా ఇబ్బంది పడుతున్నాం. ఎగువ నుంచి వచ్చిన నీరు ఇక్కడే నిల్వ ఉండిపోవడంతో మా ఇళ్లు మునిగిపోతున్నాయి. గతంలో గోడలు తడిసి కూలిపోయాయి. మా కష్టాలను గుర్తించి కాల్వ నిరించాలని కోరుతున్నాం.

– బైరెడ్డి సీతమ్మ, కలాసీ కాలనీ

కూలిన ఇల్లు కట్టుకోలేని స్థితిలో ఉన్నాం



గతంలో వచ్చిన ముంపు కారణంగా కూలిన ఇళ్లు కట్టుకోలేని స్థితిలో ఉన్నాం. మా కష్టాలు నాయకులు తొలగించాలి. ఈసారి కూడా వర్షాలకు ముంపు వస్తే చాలా ఇబ్బందులు పడతాం. మా కష్టాలు తీరేందుకు కృషి చేయాలని కోరుతున్నాం.

– కొల్లి లక్ష్మి, కలాసీ కాలనీ

నిషేధిత ప్లాస్టిక్ వినియోగించరాదు



నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్న శానిటరీ అధికారులు

మల్కాపురం: నిషేధిత ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనర్థాలు ఎదురవుతాయని 58వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ అన్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న పలు దుకాణాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. వార్డు పరిధిలోని శ్రీహరిపురం, రామ్‌నగర్, పిలకవానిపాలెం తదితర ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో నిషేధిత ప్లాస్టిక్ వాడుతున్న వారి వద్ద నుండి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి హానికారం అన్నారు. ప్రతి ఒక్కరు జూట్ లేదా పేపర్ బ్యాగ్‌లు వినియోగించి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో విశేషంగా హోమం

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్దనున్న ప్రాచీన రామాలయంలో శుక్రవారం ఘనంగా హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలో వేదికపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. విశేషంగా పారాయణాలు జరిపారు.

క్లుప్తంగా

వృద్ధురాలి అదృశ్యం



రవణమ్మ (ఫైల్)

గోపాలపట్నం: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమయిందని కుటుంబ సభ్యులు గోపాలపట్నం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపురం గొల్ల వీధిలో నివాసముంటున్న ఉప్పిలి రవణమ్మ (55) కొడుకు ఉప్పిలి రాజుతో కలిసి నివాసముంటోంది. కొన్నేళ్లుగా ఆమెకు మతిస్థిమితం లేక ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఈ నెల 21 రాత్రి 9 గంటల సమయంలో మాత్రలు వేసుకోవడం విషయంలో గొడవ పడింది. తన అమ్మగారింట్లో పడుకుంటానని వెళ్లిన ఆమె అక్కడికి చేరిన కొద్ది సేపటికి ఎటు వెళ్లిందో కనిపించకపోవడంతో చుట్టు పక్కల వాకబు చేయడంతో పాటు చుట్టాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసుల్ని ఆశ్రయించారు. వృద్ధురాలు ఎక్కడైనా కనిపిస్తే సమాచారమివ్వాలని గోపాలపట్నం పోలీసులు కోరారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



59వ వార్డు నెహ్రూనగర్ వద్ద జెండా ఎగరేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

మల్కాపురం: సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవం పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో శుక్రవారం జరిగింది. మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 59వ వార్డు నెహ్రూనగర్, 60వ వార్డు కోరమాండల్ గేటు వద్ద, 61వ వార్డు మల్కాపురం సీఐటీయూ కార్యలయం వద్ద వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో నాయకులు జెండాలు ఎగరేశారు. ఈ కార్యక్రమాల్లో మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఉరుకూటి బాబూరావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత మల్కాపురం సీఐటీయూ కార్యలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పెంటారావు, బాబూరావు యాదవ్ మాట్లాడుతూ సీఐటీయూ యూనియన్‌తో కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ధారణ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట



రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

విశాఖ విద్య: నగరంలోని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. 90వ వార్డు సీతారామరాజు నగర్, ఏపీఎస్ఈబీ కాలనీ, సుసర్లకాలనీల్లో రూ.1.90 కోట్లతో చేపట్టనున్న రహదారుల అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన కార్పొరేటర్ బొమ్మిడి రమణతో కలసి శంకుస్థాపన చేశారు. కాలనీల్లో సమస్యలు గుర్తించి, కార్పొరేటర్ల ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రహదారులు, డ్రైనేజీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఏఈ వెంకట లక్ష్మి, మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, స్థానికులు అరుణ్, సోమేశ్, నరవ పైడిరాజు, విళ్లా సత్యనారాయణ తదితరులు. పాల్గొన్నారు.

వదలని వాన

- తడిసి ముద్దవుతున్న సేవా మార్గాలు
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, పాదచారులు, వాహన చోదకులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వారం రోజుల నుండి సాయంత్రమైతే చాలు ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తోంది. పగలంతా ఎండ తీవ్రతతో ఇబ్బదులకు గురవుతున్న పారిశ్రామిక ప్రాంత వాసులకు సాయంత్ర కురుస్తున్న వర్షానికి సేదదీరుతున్నారు. అయితే కురుస్తున్న వర్షాలకు పలు సేవా మార్గాలు తడిసి ముద్దవుతుండటంతో పాటు పలు చోట్ల నీరు నిలిచిపోతోంది. ముఖ్యంగా 58వ వార్డు ములగాడ సేవా మార్గం, 61వ వార్డు ఆర్‌కేపురం సేవామార్గంపై వర్షం నీరు నిలిచిపోయి వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.



ములగాడ సేవా మార్గంలో నిలిచిన బురద నీరు



బురదమయంగా మారిన ఆర్‌కేపురం సేవా మార్గం



వర్షంతో వ్యాపారుల అవస్థలు

మురుగూ మీదే.. పవరూ మీదే

- స్థానికుల విద్యుత్ వాడుతున్న జీవీఎంసీ సిబ్బంది



అజంతా పార్క్ కాలనీ ప్రధాన రహదారిలో యూజీడీ గొయ్యి తవ్వుతున్న జీవీఎంసీ సిబ్బంది



యూజీడీ నుంచి వస్తున్న మురుగు నీరు



మురుగు సమస్య తొలగించేందుకు ఒక ఇంటి నుంచి విద్యుత్ సేకరిస్తున్న వైనం

గోపాలపట్నం: యూజీడీ పనుల కోసం స్థానికుల నుంచి జీవీఎంసీ వాటర్ వర్క్స్ విభాగం సిబ్బంది గృహ విద్యుత్ తీసుకుని వాడుకుంటున్నారు. 92వ వార్డు అజంతా పార్క్ వద్ద యూజీడీ లీక్ అవుతోంది. దాన్ని నివారించేందుకు ఎల్‌జీ పాలిమర్స్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో అజంతా పార్క్ వద్ద యూజీడీ మూత తొలగించేందుకు డ్రిల్లింగ్ యంత్రాన్ని వాడారు. దీని కోసం స్థానికుల నుంచి విద్యుత్ సేకరించారు. ఇటీవల ఒక సంస్థ సిబ్బంది సైతం మంచినీటి సరఫరాకు వ్యక్తిగత కనెక్షన్లు ఇచ్చేందుకు ఇదే విధానాన్ని అనుసరించారు. ఇది చూసిన వారు జీవీఎంసీ అధికారులు ఇచ్చిన అలుసు వల్లే సంస్థ కాంట్రాక్టర్ ఈ విధానాన్ని అనుసరిస్తున్నాడని విమర్శిస్తున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చూడాలని కోరుతున్నారు.

నేడు కృష్ణ గీతాలతో సినీ సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు తదితరులు

దాబాగార్డెన్స్: దివంగత సినీనటుడు, సూపర్‌స్టార్ కృష్ణ 60 వసంతాల సినీ వజ్రోత్సవంలో భాగంగా 82వ జయంతిని పురస్కరించుకుని శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సూపర్ స్టార్ కృష్ణ పేరిట ప్రత్యేక సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు పల్లవి మ్యూజిక్ సంస్థ అధినేత పల్లా బాబ్జి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయ ప్రాంగణంలో సినీ సంగీత విభావరి పోస్టర్‌ను ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో కళాకారులు, సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, డాక్టర్ టి. కుమార్‌రాజు, లక్ష్మీ స్వరూప, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు

దాబాగార్డెన్స్: ప్రజల వినతులు, అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. అందిన 16 వినతుల్లో జోన్-1 నుంచి ఒకటి, జోన్-2 నుంచి ఒకటి, జోన్-3 నుంచి ఒకటి, జోన్-4 నుంచి రెండు, జోన్-5 నుంచి తొమ్మిది, జోన్-7 నుంచి రెండు వినతులు వచ్చాయి. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చని చీఫ్ సిటీ ప్లానర్ తెలిపారు. కార్యక్రమంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు



కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చూస్తూ, వేదికల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కాళీమాత టెంపుల్ నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారిపై యోగా వేదికలతో పాటు, మరో 25 అదనపు వేదికలను ఏర్పాటు చేయనున్నారు. ఈ వేదికల వద్ద తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్, హెల్ప్ కౌంటర్లు వంటి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ ప్రాంతం వారు ఏ వేదికకు చేరుకోవాలి, వాహనాలు ఎక్కడ నిలపాలి వంటి వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధాన వేదిక మార్గంలో సుందరీకరణ, మరమ్మత్తులు, విద్యుదీకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల మధ్యలో చెట్ల కొమ్మలు తొలగించి, డివైడర్లకు, గోడలకు రంగులు వేయాలన్నారు. మత్స్యదర్శినికి రంగులు వేసి, పాడుపడిన భవంతిని కవర్ చేయాలని సూచించారు. డ్రెయిన్లను శుభ్రపరిచి, అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లో విద్యుదీకరణ, తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, హోర్డింగులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాధుర్, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రెండు గంటల్లో చిన్నారి ఆచూకీ లభ్యం



చిన్నారి మానవిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: ఆడుకుంటూ ఇంటి ప్రాంగణం నుంచి బయటకు వెళ్లిపోయిన మూడేళ్ల చిన్నారి ఆచూకీని పెందుర్తి పోలీసులు రెండు గంటల వ్యవధిలో కనిపెట్టారు. వివరాలివి.. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొగ్గవానిపాలేనికి చెందిన నకరాపు మానవి(3) గురువారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా.. ఇంటి ప్రాంగణంలో ఆడుకుంటోంది. అయితే కొద్దిసేపటికి మానవి కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.వి.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కాలనీలో శోధించారు. దాదాపు రెండు గంటల తరువాత ఓ నిర్మానుష్య ప్రాంతంలో చిన్నారిని గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

రేపు సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్

ఎంవీపీకాలనీ: సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జూన్ 1న ఎంవీపీకాలనీలోని అప్పుఘర్ ఎదురుగా ఉన్న పోలమాంబ ఫంక్షన్ హాలులో జరగనున్నాయి. ఈ మేరకు బ్రూస్ లీ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ చిన్నా ఓ ప్రకటనలో తెలిపారు. కొరియన్ చోటా ఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల కోసం జిల్లా బాలబాలికల జట్లను శుక్రవారం ఎంపిక చేశామన్నారు. 12 ఏళ్ల బాలికల విభాగంలో టి.తేజస్విని, 13 ఏళ్ల విభాగంలో జీవీ ఆరాధ్య, 16 ఏళ్ల విభాగంలో ఎస్.కావ్య, 17 ఏళ్ల విభాగంలో పి.సౌమ్య ఎంపికయ్యారు. 12 ఏళ్ల బాలుర విభాగంలో టి.తనుష్, 13 ఏళ్ల విభాగంలో సీహెచ్ మనోజ్ యాదవ్ ఈ పోటీలకు ఎంపికైనట్లు చిన్నా వెల్లడించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు గౌరీప్రియ, వైభవ్ గోపాల్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మద్దిలపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, తొలగించిన 4,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెంలో ర్యాలీ నిర్వహించారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయం నుంచి మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వరకు ర్యాలీ సాగింది. అక్కడ జరిగిన సభలో సిటు జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెపై పోలీసులు తక్షణం నిర్బంధం ఆపాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దని 1,560 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నామని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించలేని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.ఎం.కుమార్ మంగళం, మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు, పి.వెంకటరావు, జోన్ నాయకులు వి.కృష్ణారావు, వి.నరేంద్రకుమార్, కె.కుమారి, ఎం.సిహెచ్.అప్పుడు, జోన్ కార్మికులు పాల్గొన్నారు.